# 33

# దేశాలపై దేవుని తీర్పు

## (యెషయా 34; 35)

ఎదోము, లేదా ఇదుమియ యూదాకు విడువని నిత్య శత్రువుగా నిలిచిపోయింది. దేవునికి ఆయన ప్రజలకు బద్ధశత్రువులైన దేశాల్లో ఒకటిగా 34వ అధ్యాయంలో ప్రతిపాదించబడింది. యాకోబు అన్నయైన ఏశావు నామకరణాన్ని దాల్చి బైబిల్ లేఖన భాగాల్లో చోటుచేసుకొన్నది. ఇస్సాకు కుమారుల్లో కొనసాగిన శత్రుత్వం వారి తదనంతర సంతనాల మధ్య కొనసాగుతున్నట్లు సంఖ్యాకాండం 20:14-21లో ఇశ్రాయేలు, ఎదోము మధ్య చెలరేగిన మొట్టమొదటి శత్రుత్వ పోరాటం గురించి ప్రస్తావించబడింది. తర్వాత దొర్లిపోతున్న యుగాల్లో యిదే తతంగం కొనసాగింది, దీనికారణంగా యూదాకు శత్రువులైన దేశాలతోపాటు ఎదోము కూడా తీర్పులోనికి వస్తుంది.

### తీర్పుతీర్చుటకు దేవుని ఖడ్గము దిగివస్తుంది (34:1-15)

యాకోబు సోదరుడైన ఏశావు ద్వారా ఎదోముకు ఆ పేరు కలిగింది (ఆదికాండము 36:8). అతని వంశంవారు మృత సముద్రానికి ఈశాన్యంగా నివసించారు. వాగ్దాన దేశానికి ఇశ్రాయేలీయులు ప్రయాణమై వెళ్తున్నప్పుడు వీరి సరిహద్దుల గుండా ప్రయాణం చేయడానికి వీరు అనుమతి యివ్వలేదు (సంఖ్యాకాండం 20:14-18). సౌలు రాజు సైతం వారికి వ్యతిరేకంగా పోరాడినాడు (1 సమూయేలు 14:47) మరియు రాజైన దావీదు సైతం వీరిని లోబరచుకున్నాడు (2 సమూయేలు 8:14).

యూదాను అనేక మంది రాజులు పరిపాలించినంతకాలం ఎదోము శత్రువుగా నిలిచియున్నది (1 రాజులు 11:14) యెరూషలేమును నాశనం చేయడంలో వారెంతో ఆనందించారు. వారికెంతో ఆటగా అనిపించింది (కీర్తనలు 137:7). ఎదోము చేసిన గొప్ప అలజడి గురించి ప్రవక్త ప్రస్తావిస్తున్నాడు (యోవేలు 3:19; ఆమోసు 1:11, 12) మరియు ఎదోము యొక్క నాశనం గురించి చెప్పబడింది (యిర్మీయా 49:7-22; యెహెజ్కేలు 25:12-14; చూడు ఓబద్యా 8; మలాకీ 1:4).

> రాష్ట్రములారా, నాయొద్దకు వచ్చి వినుడి.
> జనములారా, చెవి యొగ్గి ఆలకించుడి
> భూమియు దాని సంపూర్ణతయు లోకమును దానిలో పుట్టినదంతయు వినును గాక.
> యెహోవా కోపము సమస్త జనములమీదికి వచ్చుచున్నది
> వారి సర్వ సైన్యములమీద ఆయన క్రోధము వచ్చుచున్నది
> ఆయన వారిని శపించి వధకు అప్పగించెను.
> వారిలో చంపబడినవారు బయట వేయబడెదరు
> వారి శవములు కంపుకొట్టును
> వారి రక్తమువలన కొండలు కరిగిపోవును

ఆకాశ సైన్యముంతయు క్షీణించును
కాగితపు చుట్టవలె ఆకాశవైశాల్యములు చుట్టబడును.
ద్రాక్షావల్లినుండి ఆకు వాడి రాలునట్లు
అంజూరపు చెట్టునుండి వాడినది రాలునట్లు వాటి సైన్యమంతయు రాలిపోవును
(యెషయా 34:1-4).

దుష్ట దేశాలమీద తాను తీర్చుతున్న తీర్పును గురించి వీక్షించడానికి భూమిపైనున్న ప్రజలందరిని ప్రభువు పిలువనంపుచున్నాడు (1, 2 వచనాలు). వారెంత భయంకర పరిస్థితులను ఎదుర్కొనవలసియున్నదో వివరించబడినది: "వారిలో చంపబడినవారు బయట వేయబడెదరు"; "వారి రక్తమువలన కొండలు కరిగిపోవును"; "వాటి సైన్యమంతయు రాలిపోవును" (3, 4 వచనాలు). మత్తయి 24:29 మరియు ప్రకటన 6:13, 14లో ముఖ్యంగా 4వ వచనంలో దేవుని తీర్పు ద్వారా భూలోకంలో మార్పులు ఎన్ని వచ్చాయో ఎంతో వివరణాత్మకంగా వివరించబడింది.

నిజముగా ఆకాశమందు నా ఖడ్గము మత్తిల్లును
ఎదోముమీద తీర్పుతీర్చుటకు
నేను శపించిన జనముమీద తీర్పుతీర్చుటకు అది దిగును
యెహోవా ఖడ్గము రక్తమయమగును
అది క్రొవ్వుచేత కప్పబడును
గొఱ్ఱెపిల్లయొక్కయు మేకల యొక్కయు రక్తము చేతను
పొట్టేళ్ల మూత్ర గ్రంథులమీది క్రొవ్వుచేతను కప్పబడును
ఏలయనగా బొస్రాలో యెహోవా బలి జరిగించును
ఎదోము దేశములో ఆయన మహా సంహారముచేయును.
వాటితోకూడ గురుపోతులును వృషభములును కోడెలును దిగిపోవుచున్నవి
ఎదోమీయుల భూమి రక్తముతో నానుచున్నది
వారి మన్ను క్రొవ్వుతో బలిసియున్నది.
అది యెహోవా ప్రతిదండనచేయు దినము
సీయోను వ్యాజ్యెమునుగూర్చిన ప్రతికార సంవత్సరము.
ఎదోము కాలువలు కీలగును
దాని మన్ను గంధకముగా మార్చబడును
దాని భూమి దహించు గంధకముగా ఉండును.
అది రేయింబగళ్లు ఆరక యుండును
దాని పొగ నిత్యము లేచును
అది తరతరములు పాడుగా నుండును
ఎన్నడును ఎవడును దానిలో బడి దాటడు
గూడబాతులును ఏదుపందులును దాని ఆక్రమించు కొనును
గుడ్లగూబయు కాకియు దానిలో నివసించును
ఆయన తారుమారు అను కొలనూలును చాచును
శూన్యమను గుండును పట్టును.
రాజ్యము ప్రకటించుటకు వారి ప్రధానుల అక్కడ లేకపోవుదురు
దాని అధిపతులందరు గతమైపోయిరి.
ఎదోము నగరులలో ముళ్లచెట్లు పెరుగును

దాని దుర్గములో దురదగొండ్లును గచ్చలును పుట్టును
అది అడవికుక్కలకు నివాసస్థలముగాను నిప్పుకోళ్లకు సాలగాను ఉండును
అడవి పిల్లులును నక్కలును అచ్చట కలిసికొనును
అచ్చట అడవి మేక తనతోటి జంతువును కనుగొనును
అచ్చట చువ్వపిట్ట దిగి విశ్రమస్థలము చూచుకొనును
చిత్తగూబ గూడు కట్టుకొనును
అచ్చట గుడ్లు పెట్టి పొదిగి నీడలో వాటిని కూర్చును
అచ్చటనే తెల్లగద్దలు తమ జాతిపక్షులతో కూడుకొనెను.

5 నుండి 15 వచనాలు ఎదోము దేశము యొక్క పథనమును వివరిస్తుంది. యిది దుష్ట ప్రజల పై దేవుని శిక్షకు నిదర్శనంగా ఉంది. వీరంతా దేవుని ప్రజలకు దీర్ఘకాల శత్రువులు. దావీదు మహారాజు ఈ ఎదోమీయులను తన సేవకులుగా చేసుకున్నప్పటికి (2 సమూయేలు 8:14), ఇశ్రాయేలీయులకు, యూదావారికి తాము చేస్తున్న చాకిరీ గురించి ఈ ఎదోమీయులు తిరుగుబాటు చేస్తూనేయున్నారు.

అందుకు వారి గురించి దైవ సందేశం యిలావుంది, “నిజముగా ఆకాశమందు నా ఖడ్గము మత్తిల్లును ఎదోముమీద తీర్పుతీర్చుటకు నేను శపించిన జనముమీద తీర్పుతీర్చుటకు అది దిగును” (5 వచనం). “ప్రభువు యొక్క ఖడ్గము” “రక్తముతో నిండుకొని” యున్నది. యాజకుల యొక్క కత్తులు ఉన్నట్లు వారు బల్యర్పణలు అర్పించెదరు (6 వచనం). వారి భూమి అంతయు రక్తముతోను క్రొవ్వుతోను కప్పివేయబడినది. అందుకే యెషయా యిలా అంటున్నాడు, “ఏలయనగా బొస్రాలో యెహోవా బలి జరిగించును ఎదోము దేశములో ఆయన మహా సంహారము చేయును” (6సి వచనం). పండితులు అభిప్రాయం ప్రాకారం బొస్రా అనగా ఎదోము యొక్క రాజదాని.

త్వరలో “తీర్పు దినము” రాబోతుంది (8 వచనం) ఎందుచేతనంటే ఎదోము చేసిన ఘోరమైన పాపమునకు ఎదోము చేసిన భీబత్సాలకు సొదొమా గొమొఱ్ఱాలో జరిగిన కార్యాలు గుర్తుకు వస్తాయి, “ఎదోము కాలువలు కీలగును దాని మన్ను గంధకముగా మార్చబడును దాని భూమి దహించు గంధకముగా ఉండును” (9 వచనం). ఇది నిర్మానుష్యముగా, దానిని గూడబాతులు, ఏదుపందులుకు, గుడ్లగూబయు కాకియు దానిలో నివసించును (11 వచనం). ఎదోము యొక్క నాయకులు (“ప్రధానులు,” “రాజులు,” “అధిపతులు”) కనిపించకుండ పోతున్నారు (12 వచనం). అక్కడ “కుక్కలు,” “నిప్పుకోళ్ళు,” “అడవిపిల్లులు,” “నక్కలు,” “చువ్వపిట్ట,” “చిత్తగూబ” మొదలైన వాటికి నివాసం యోగ్యమైనది (13–15 వచనాలు). దేవుని పై తిరుగుబాటు చేయువారి విపత్తు అదే.

### “ప్రభువు యొక్క ధర్మశాస్త్ర గ్రంథాన్ని వెదకుట” (34:16, 17)

యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి
ఆ జంతువులలో ఏదియు లేక యుండదు
దేని జతపక్షి దానియొద్ద ఉండక మానదు
నా నోటనుండి వచ్చిన ఆజ్ఞ యిదే
ఆయన నోటి ఊపిరి వాటిని పోగుచేయును.
అవి రావలెనని ఆయన చీట్లు వేసెను

ఆయన కొలసూలు చేత పట్టుకొని వాటికి ఆ దేశమును పంచిపెట్టును.
అవి నిత్యము దాని ఆక్రమించుకొనును
యుగయుగములు దానిలో నివసించును.

రాబోవు తరాలకొరకు తన సందేశము నమోదు చేయబడుతుందన్న విషయాన్ని యెషయా నిరీక్షించాడు, ఇతరులు ఆ ప్రవచనమును ఎంతో బలమైనదిగా ఉందని, పరీక్షించి తెలుసుకున్నారు (16, 17 వచనాలు).

ఎదోమీయులు అనేక దండయాత్రలు చేసారు, తట్టుకున్నారు, కానీ క్రీ.పూ. 4వ శతాబ్దములో నెపాతీయుల చేతిలో ఓడిపోయినారు, తప్పించుకున్నవారు యూదాకు దక్షిణంగా నివాసాలు ఏర్పాటు చేసికొన్నారు, ఆ ప్రాంతాన్ని ఇదూమీయ అని పిలుస్తున్నారు, దీన్ని లాటిన్ భాషలో "ఎదోము" అని అర్థమిస్తుంది, క్రీ.శ. 70వ సంవత్సరములో రోమావారు పాలస్తీనాను జయించినప్పుడు ఎదోమీయులు పూర్తిగా నాశనమైనారు.

### "ప్రభువు విడిపించినవారు తిరిగి వస్తారు" (35:1–10)

ఎదోమీయులకు సంభవించిన నాశనము ఇతర దేశాలకు సంభవిస్తుంది అనే సూచనగా ఉంది. శేష జనము ఎలా విమోచించబడినారో దాని గురించి యెషయా ఒక చక్కని పద్య బాగాన్ని వ్రాస్తున్నాడు, అది స్తుతికి సంభవించినది. J. Alec Motyer గారు యిలా అన్నారు, "ఇటువంటి చక్కని పద్య భాగానికి పోలినటువంటి రచన మరి ఏదీ ఉండదు."[1]

### రాబోవుచున్న ఆశీర్వాదములు (35:1–7)

అరణ్యమును ఎండిన భూమియు సంతోషించును
అడవి ఉల్లసించి కస్తూరిపుష్పమువలె పూయును
అది బహుగా పూయుచు ఉల్లసించును
ఉల్లసించి సంగీతములు పాడును
లెబానోను సౌందర్యము దానికి కలుగును
కర్మెలు షారోనులకున్న సొగసు దానికుండును
అవి యెహోవా మహిమను మన దేవుని తేజస్సును చూచును.
సడలిన చేతులను బలపరచుడి
తొట్రిల్లు మోకాళ్లను దృఢపరచుడి.
తత్తరిల్లు హృదయులతో ఇట్లనుడి
–భయపడక ధైర్యముగా ఉండుడి
ప్రతిదండన చేయుటకై మీ దేవుడు వచ్చుచున్నాడు
ప్రతిదండనను దేవుడు చేయదగిన ప్రతికారమును ఆయన చేయును
ఆయన వచ్చి తానే మిమ్మును రక్షించును.

"అరణ్యమును ఎండిన భూమియు" మరియు "అడవి" (ఆరాబా) (1 వచనం) అనే ప్రాంతాలు మోషే ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తునుండి నిర్గమునందు నడపించిన యూదాకు దక్షిణంగా ఉన్న ప్రాంతాలు. సంవత్సరమంతటిలో ఎండిన నేలగా ఎడారి భూమిగా ఉంటుంది; తరువాత కొంత కాలం వర్షా కాలములో చక్కని మొక్కలు వృక్షాలు కనుల విందు చేస్తాయి. Clyde M. Woods యిలా అంటున్నాడు: "దేవుడు లేకుండ మనిషి యొక్క జీవితం

ఒక ఎడారిలాంటి జీవితం, కానీ వసంత కాలములో చక్కగా చెట్లు ఫలభరితంగా ఉంటాయి. ఈ విషయంలో సమానమైన భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. దేవుడు లేని మనిషి జీవితం ఒక ఎడారి అరణ్య జీవితం, కాని తర్వాత వర్షాకాలం వర్షాలు కురిసి ఎంతో ఆహ్లాదకరమైన సమయం లభిస్తుందో అలాగే ప్రభువు యొక్క రాకడ ఆనందాన్ని నిరీక్షణను తెచ్చును."[2]

"అది బహుగా పూయుచు ఉల్లసించును" (2 వచనం) అంటున్నాడు, యెషయా ఇక్కడ అరణ్యమును "లెబానోను సౌందర్యము"తో పోల్చాడు. "కర్మెలు, షారోనుకున్న సొగసు దానికుండును." అవి "బహు సారవంతమైన భూభాగములు." ఉల్లసించి సంగీతములు పాడుట అనునది దేవుని కృపకు తార్కాణముగా ఉన్నది.[3]

ప్రవక్త యింకా యిలా అంటున్నాడు, "అవి యెహోవా మహిమను మన దేవుని తేజస్సును చూచును." ఆ ప్రాంతం మీద ప్రజలమీద దేవుని కృప కుమ్మరించబడినందున జరిగిన గొప్ప మార్పుకు ఈ చిత్రం సూచనగా ఉంది.

"సడలిన చేతులు" (దీని శబ్దార్థం ప్రకారం "బలహీనమైన చేతులు" అని) "తొట్రిల్లిన కాళ్ళు" (అనగా "వణకుచున్న మోకాలు" అని అర్థం) "తత్తరిల్లు హృదయము" (3, 4 వచనాలు). వాటికి ఎంతో ధైర్యము కావాలి. ఈ ప్రజలకు కావలసిన సందేశం "ధైర్యంగా వుండుడి, భయపడకండి" అని చెప్పడమే. ఆయన సమయంలో, దేవుడు ప్రతి దండన చేయుటకు వచ్చుచున్నాడు, ఆయనే వచ్చి మిమ్మును రక్షించును. బైబిలంతటిలో ఈలాంటి అభయమిస్తున్న ధైర్యాన్ని తరచుగా చూస్తున్నాము. అయినప్పటికి ప్రజలు భయాందోళనలతో ఉంటున్నారు. భయంతో రోదిస్తున్నారు. అయ్యో యింకెంతకాలం? అంటున్నారు, పేతురు యిలా అంటున్నాడు, "కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశంపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీయెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2 పేతురు 3:9).

గ్రుడ్డివారి కన్నులు తెరవబడును
చెవిటివారి చెవులు విప్పబడును
కుంటివాడు దుప్పివలె గంతులువేయును
మూగవాని నాలుక పాడును
అరణ్యములో నీళ్లు ఉబుకును
అడవిలో కాలువలు పారును
ఎండమావులు మడుగులగును
ఎండిన భూమిలో నీటిబుగ్గలు పుట్టును
నక్కలు పండుకొనినవాటి ఉనికి పట్టులో జమ్మును
తుంగగడ్డియు మేతయు పుట్టును.

"అప్పుడు" (అనగా "ఆ సమయంలో"; 5 వచనం) అనునది "ప్రవచనాత్మక రక్షణా సమయం, అనగా వివరించబడిన ఆశీర్వాదాలు కనబడును."[4] ఒకేసారి యోహాను తన శిష్యులను యేసునొద్దకు పంపించి "రాబోవువాడవు నీవేనా, మేము మరియొకని కొరకు కనిపెట్టవలెనా?" (మత్తయి 11:3) అని అడగమన్నాడు. అప్పుడు ప్రభువు యెషయా 35:5లోని మాటలను వారితో ప్రస్తావించాడు. ఇక్కడ మనకు ఎంతో స్పష్టంగా అర్థమయ్యే

విషయమేమంటే, యిక చెప్పబడి వివరించబడిన మహిమ శరీరిక సంబంధమైనది (భౌతికం) కాదు గాని ఆత్మీయ లోకానికి మరియు క్రీస్తులోని అనుభవానికి చెందినది.

**రాజ మార్గం సిద్ధంచేయబడుతుంది (35:8–9)**

> అక్కడ దారిగా నున్న రాజమార్గము ఏర్పడును
> అది పరిశుద్ధ మార్గమనబడును
> అది అపవిత్రులు పోకూడని మార్గము
> అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును
> మూఢులైనను దానిలో నడుచుచు త్రోవను తప్పక యుందురు
> అక్కడ సింహముండదు క్రూరజంతువులు దాని ఎక్కవు, అవి అక్కడ కనబడవు
> విమోచింపబడినవారే అక్కడ నడచుదురు
> యెహోవా విమోచించినవారు పాటలుపాడుచు తిరిగి సీయోనునకు వచ్చెదరు.
> వారి తలలమీద నిత్యానందముండును
> వారు ఆనందసంతోషములు గలవారై వచ్చెదరు
> దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును.

తర్వాత యెషయా రాజ "మార్గము" గురించి (8 వచనం) మాట్లాడుచున్నాడు. "అక్కడ దారిగానున్న రాజమార్గము ఏర్పడును" అనగా అది "పరిశుద్ధ మార్గము." సామెతలు 15:19లోని భాగాన్ని సూచించబడుతుంది "సోమరి మార్గము ముళ్ల కంచె యథార్థవంతుల త్రోవ రాజమార్గము." యెషయా ఊహించిన రీతిగా అరణ్యం పుష్పించడం మాత్రమే కాదు, అసలు మార్గమే లేని ప్రాంతంలో రాజమార్గము అనగా "పరిశుద్ధ" మార్గము ఏర్పడుతుంది. పరిశుద్ధతకు అడ్డం వచ్చే ప్రతి ఆటంకాన్ని ప్రభువు తీసివేస్తాడు. ఇక్కడ యెషయా ఈ మాటలను చెబుతున్నాడు అంటే అతడు నీతిమంతులకు దేవుని యొద్దకు వెళ్ళడానికి గొప్ప రాజ మార్గం తెరువబడియున్నదన్న భావంతో వివరిస్తున్నాడు (యెషయా 11:16; 19:23; 40:3).

"అపవిత్రమైనది ఆ బాటలో ప్రయాణించదు." "అపవిత్రము" అంటే (*tame*) ఇది నీతి సంబంధమైన మతపరమైన అపవిత్రతయైయున్నది (యెషయా 6:5). "మూఢుడైనను దానిలో నడచుచూ త్రోవతప్పకయుందురు" ఇక్కడనే "మూఢులు" (*'ᵉwil*) అనగా నీతి నియమాలు లేక దారిమళ్ళినవారు నీతికి బదులు దుష్టత్వాన్ని కోరుకొనేవారు. జ్ఞానాన్ని క్రమశిక్షణను తృణీకరించేవారు (యెషయా 19:11; సామెతలు 1:7; 7:22; 14:9; 16:22; 20:3).

"విమోచించబడినవారు" మరియు "విడిపింపబడినవారు" (9, 10 వచనాలు) అనునది అపాయము, విపత్తులనుండి ప్రభువు కాపాడిన వారికి సూచనగాయున్నది. "విమోచింపబడినవారు" (*ge'ulim*) ఈ మాట ఈ గ్రంథంలో యిక్కడ యెషయా ప్రవచనాల్లో[5] నామవాచకంగా వాడబడిన విధానము అని గ్రహించనగును. ఇక్కడ *ga'al* అనే అసమాపక క్రియాపదం అతని సోదరుడు బీదవాడైనప్పుడు అతని సమీప బంధువు కష్ట సమయంలో అపాయ సమయంలో విడిపించేవాడు అని అర్థం (లేవీయకాండము 25:25; సంఖ్యాకాండము 5:8). ఇక్కడ కేవలం ప్రభువు మాత్రమే ఆయన ఒక్కడు మాత్రమే ఈ భాద్యతను నెరవేర్చుకొనగలడు.

"ప్రభువు ద్వారా విమోచింపబడినవారు" (*phedu'yey, YHWH*) వారి పాపాలకు క్రయధనం చెల్లింప బడినవారు.[6] దాని ఫలితం ఎలావుంటుందంటే, "సంతోషంతో కేకలు వేయడం," "నిత్యానందం," మరియు "ఆనందం."

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 272. [2]Clyde M. Woods, *People's Old Testament Notes: Isaiah* (Henderson, Tenn.: Woods Publications, 2002), 149. [3]చూడు యెషయా 12:6; 24:14; 44:23; 52:9. [4]Edward J. Young, *The Book of Isaiah,* vol. 2, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1969), 450. [5]యెషయా 1:27లో క్రియా పదం మొదటి సారి కనిపిస్తుంది. [6]చూడు యెషయా 51:10, 11.

## వాక్యభాగాన్ని బోధించుట

ఎడ్డీ క్లోయర్

### ❖❖❖ తీర్పును గురించిన పూర్తి వివరణ ❖❖❖ (34వ అధ్యాయము)

34వ అధ్యాయంలో దేవుని తీర్పును గురించి ఉన్నది. దేశాలు తనకు లెక్క చెప్పవలసియున్నది. పాత నిబంధనలో తీర్పు విధానమెలావుందనగా, దేశాలకు దేశాలనే సర్వ నాశనం చేయడం, కాని నూతన నిబంధన విధానమేదనగా రాబోవు తీర్పు దినాన్ని ఎదుర్కోవడం. ఏదేమైనా తీర్పు విధానం ఎంతో నిలకడగాను, నిరాక్షేపంగా తూచతప్పక అమలు చేయబడుతుంది. పాత నిబంధన ప్రకారం దేశాలకు సంబంధించిన, క్రొత్త నిబంధనలో వ్యక్తులకు సంబంధించి భాద్యతాయుతమైన రీతిని ఆలోచించినట్లయితే, దేవుడు తన తీర్పును వ్యక్తిగత పాపాన్నిబట్టి ప్రతివారిని తప్పక తీర్పులోనికి తెస్తాడు అన్నది సత్యం. అంతంలో లెక్కలు గట్టుకునే తప్పు ఏ వ్యక్తిగాని ఏ దేశంగాని తప్పించుకొనలేరు.

ఈ దేశాల తీర్పు ముఖ్యంగా, ఎదోము పై తీర్పు అనునవి మానవాళి పై దేవుని తీర్పు ఎంత నిలకడైనదో అన్న విషయాన్ని మనకు గుర్తుచేస్తుంది కాబట్టి మానవుని యొక్క తీర్పు ఎలావుంటుందో ఎంత భయంకరంగా ఉంటుందో మనం గమనించి యుండవలెను.

*మొట్టమొదటిగా "సర్వస్వం" సర్వమానవాళి, సర్వ దేశములు అనునవి.* దేవుని యొక్క తీర్పు ఎలావుంటుందో ఎంతో వివరణాత్మకంగా 34వ అధ్యాయంలో నమోదు చేయబడి యున్నది. యెషయా యిలా అంటున్నాడు, "రాష్ట్రములారా, నాయొద్దకు వచ్చి వినుడి. జనములారా, చెవి యొగ్గి ఆలకించుడి భూమియు దాని సంపూర్ణతయు లోకమును దానిలో పుట్టినదంతయు వినును గాక. వారి సర్వ సైన్యములమీద ఆయన క్రోధము వచ్చుచున్నది యెహోవా కోపము సమస్త జనములమీదికి వచ్చుచున్నది ఆయన వారిని శపించి వధకు అప్పగించెను" (1, 2 వచనాలు). ఈ ప్రవచనం ప్రస్తుతం వర్తమాన కాలంలో చెప్పబడినట్లున్నప్పటికి, ఏ దేశాలైతే దేవుని పై తిరుగుబాటు చేశాయో, అవిధేయత కనబర్చాయో వాటిని పూర్తిగా నాశనం చేస్తానని దేవుడు ఖండితంగా ప్రకటిస్తున్నాడు, నూతన

నిబంధనలో క్రీస్తు నిత్య తీర్పు ప్రతి దేశంపైవుంటుందని క్రీస్తు వివరించాడు. ఆయనిలా అన్నాడు, "తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు ..." (మత్తయి 25:31-33).

*రెండవదిగా, "సంపూర్ణత" అంటే అంతయు పరిపూర్ణముగా ఆసాంతం.* ప్రతి మనుష్యుని పని పరీక్షించబడతుంది, ఏదియు విడిచిపెట్టబడదు. ప్రభువు కోపాగ్ని రాజ్యాలమీద వారి సైన్యాలంతటి మీద రగులుకుంటుందని యెషయా అంటున్నాడు (2 వచనం). ఎందుకు యిదంతా? దీనంతటికి వాస్తవమైన కారణం వారు ఆయనకు వ్యతిరేకంగా పాపం చేశారు. వారి పాపపు పాత్ర పొంగిపొర్లిపోతుంది. పౌలు యిలా అంటున్నాడు, "ఎందుకనగా తాను జరిగించిన క్రియచొప్పున, అవి మంచిదైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటిఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీయులకు 5:10). సముద్రము దానిలో మరణించిన వారిని, పాతాళము మృతులను అప్పగించడం యోహాను చూచాడు. అతడిలా అంటున్నాడు, "వారిలో ప్రతివాడు తన క్రియలచొప్పున తీర్పుపొందెను" (ప్రకటన 20:13).

*మూడవదిగా, "సర్వస్వం" అనేది దాని ఆఖరు చిట్టచివరి వరకు అని అర్థం.* ఈ అధ్యాయంలో పద్యరూపకంగా, అలంకారప్రాయంగా గీతం చిత్రంలా చిత్రీకరించబడిన భావాలు మనకు కొట్టొచ్చినట్లు కనబడతాయి. యెషయా యిలా అంటున్నాడు, "వారిలో చంపబడినవారు బయట వేయబడెదరు వారి శవములు కంపుకొట్టును వారి రక్తమువలన కొండలు కరిగిపోవును ఆకాశ సైన్యముంతయు క్షీణించును కాగితపు చుట్టవలె ఆకాశవైశల్యములు చుట్టబడును. ద్రాక్షావల్లినుండి ఆకు వాడి రాలునట్లు అంజూరపు చెట్టునుండి వాడినది రాలునట్లు వాటి సైన్యమంతయు రాలిపోవును" (3, 4 వచనాలు). ఎదోము గురించి అతడిలా చెబుతున్నాడు, "గూడబాతులును ఏదుపందులును దాని ఆక్రమించు కొనును గుడ్లగూబయు కాకియు దానిలో నివసించును ఆయన తారుమారు అను కొలనూలును చాచును శూన్యమను గుండును పట్టును" (11 వచనం).

దేవుని సముఖంలో తీర్పు కోసం నిల్చుండిన వారిని గురించి క్రొత్త నిబంధనలో యేసు యిలా అంటున్నాడు, "వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:46). దేవుడు తన తీర్పు విధానాన్ని ఆధారం చేసుకొని పాత నిబంధన కాలంలోని అనేక దేశాలను అంతం చేశాడు. క్రొత్త నిబంధనలో చూచినట్లయితే దేవుని సింహాసనం ముందు తప్పక నిలువబడవలసినదేనని యేసు చెబుతున్నాడు. హెబ్రీయులకు 9:27లో, "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తర్వాత తీర్పు జరుగును." ఇక ఆఖరి తీర్పు ఒక వ్యక్తి నిత్య గమ్యాన్ని, స్థితిని నిర్ణయిస్తుంది. దాని తర్వాత యిక ఎలాంటి విన్నపం చేసుకునే అవకాశం లేదు.

ఈ అధ్యాయంలోని ప్రతి అంశాన్ని ఎంతో సూక్ష్మంగా పరిశీలించవలసియున్నది. దేవుడు తీర్పు తీర్చు దేవుడంటూ మనకు గుర్తు చేస్తుంది. ఆయన నీతిమంతుడు, తన వాక్కుకు పెడచెవిని బెట్టి, కళ్ళతో త్రొక్కివేయబడడాన్ని ఆయన సహించడు ఒప్పుకోడు.

## ❖❖❖ దేవుడు మనకు తోడుగా ఉన్నప్పుడు ❖❖❖
## (35వ అధ్యాయం)

ఎంతో ఆనందభరితమైన సమయాన్ని యెషయా చిత్రీకరిస్తున్నాడు. దేశం ఎంతో సౌందర్యమానంగా విలసిల్లుతుంది, దేవుని మహిమ దాంట్లో కనబడుతుంది. ఏ సమయాన్ని గురించి అతడు చెబుతున్నాడు? చెరలోనివారు యెరూషలేముకు తిరిగివస్తారని ప్రవచనాన్ని అలంకార ప్రాయంగా యిది బహుశ చెప్పబడియుండవచ్చునన్న అభిప్రాయాలు కూడ కనబడుతుంది. లేదా యింకో అభిప్రాయం కూడ అయుండవచ్చు. రాబోవుచున్న క్రైస్తవ్యం గురించి కూడ అయుండవచ్చు. ఇది రెండు భావాలుగల ప్రవచనమై సంయుక్తంగా చెప్పబడి యుండాలి, అది యెషయా కాలం నాటి వాస్తవాలను గురించి లేదా ఆ తర్వాత చాలా కాలంనాటి అనగా ఈనాడు మనకు కూడ వర్తించుచున్నది అని చెప్పవచ్చు.

దీన్ని గురించిన సరైన భావాన్ని సంపూర్తిగా వ్యక్తం చేయలేనప్పటికి, ఒక సత్యాన్ని మాత్రం మనం స్పష్టంగా గ్రహించగలం. దేవుడు తనతో కలిసి జీవిస్తున్నాడు అంటున్న దేశం దాని ప్రజలు ఎంత మహిమోన్వితంగా ఉంటుందోనని ఈ వాక్యభాగం తెలియజేస్తుంది. ఎక్కడైతే దేవుడు తన హృదయ వాంఛతో తన సన్నిధిలో నిల్పుతాడో అక్కడ ఎంతో మనోహరమైన పరిస్థితులు యెషయా వివరిస్తున్నట్లు నిల్చివుంటాయి.

*దేవుడు ఎక్కడ నివసిస్తాడో అక్కడ సుందరంగా ఉంటుంది.* యెషయా యిలా అంటున్నాడు, "అరణ్యమును ఎండిన భూమియు సంతోషించును అడవి ఉల్లసించి కస్తూరిపుష్పమువలె పూయును అది బహుగా పూయుచు ఉల్లసించును ఉల్లసించి సంగీతములు పాడును లెబానోను సౌందర్యము దానికి కలుగును కర్మెలు షారోనులకున్న సొగసు దానికుండును అవి యెహోవా మహిమను మన దేవుని తేజస్సును చూచును" (1, 2 వచనాలు). దేవుడు లేని దేశం ఏది కూడ ఎంతో గొప్ప ఆశీర్వాదాలతో విలసిల్లదు అన్నది ఎంతో వాస్తవం.

*ఎక్కడైతే దేవుని సన్నిధియున్నదో, అక్కడ రక్షణ, గొప్ప ప్రోత్సాహాలు లభిస్తాయి.* యెషయా యిలా అంటున్నాడు, "సడలిన చేతులను బలపరచుడి తొట్రిల్లు మోకాళ్లను దృఢపరచుడి. తత్తరిల్లు హృదయులతో ఇట్లనుడి – భయపడక ధైర్యముగా ఉండుడి ప్రతిదండనను చేయుటకై మీ దేవుడు వచ్చుచున్నాడు ప్రతిదండనను దేవుడు చేయదగిన ప్రతికారమును ఆయన చేయును ఆయన వచ్చి తానే మిమ్మును రక్షించును" (3, 4 వచనాలు). దేవుడు సార్వభౌముడు ఆయన తన యొద్దకు నమ్మిక విధేయతతో వచ్చువారెవరైనా ఆయన రక్షిస్తాడు, ఏ వ్యక్తియైనా – ఎలాంటి స్థితిలో ఉన్నాసరే వారి మధ్య దేవుడున్నట్టయితే అంతకంటే ప్రోత్సాహకర పరిస్థితేమియు లేదు.

ఎక్కడైతే దేవుడున్నాడో అక్కడ ఎలాంటి చెడ్డ పరిస్థితులున్నా అవన్నీ సంతోషకరమైన మేలైన పరిస్థితులుగా మారిపోతాయి. యెషయా యిలా అంటున్నాడు, "గ్రుడ్డివారి కన్నులు తెరవబడును చెవిటివారి చెవులు విప్పబడును కుంటివాడు దుప్పివలె గంతులువేయును మూగవాని నాలుక పాడును అరణ్యములో నీళ్లు ఉబుకును అడవిలో కాలువలు పారును" (5, 6 వచనాలు). నిరీక్షణలేనివారికి సైతం దేవుడు నిరీక్షణ, మనుష్య జ్ఞానానికి మించిన నిరీక్షణను కల్పిస్తాడు. కుంటివారు సైతం ఎగిరి గంతులేస్తారు, చెవిటివారు వింటారు, మూగవారు మాట్లాడతారు. యేసు యోహానుకు ఒక మాట పంపించాడు: "గ్రుడ్డివారు చూపుపొందుచున్నారు, కుంటివారు నడుచుచున్నారు, కుష్ఠరోగులు శుద్ధులగుచున్నారు,

చెవిటివారు వినుచున్నారు, చనిపోయినవారు లేపబడుచున్నారు, బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది" (మత్తయి 11:5). యేసు ఈ లోకంలోవున్నప్పుడు ప్రజలు భౌతికంగా మార్పు చెందారు, ఆత్మీయంగా పునరుద్ధరించబడినారు, ఆయన తన దైవత్వాన్ని బట్టి వారిమీద జాలిపడినాడు, స్వస్థపర్చాడు. అందుచేత కుంటివారు సైతం వారు పూర్తిగా స్వస్థత పొందనప్పటికి సమృద్ధి జీవాన్ని అనుభవించుచున్నారు. రోగియైపడకను పడినవాడు సైతం ఆనందమయంగా ఆయన చేస్తున్నాడు, ఒక వీల్ చేర్‌ను సైతం ఒక చక్కని బండిగా, సమాధి సైతం మహిమకు ప్రవేశ ద్వారంగా చేస్తున్నాడు.

దేవుడున్న దగ్గర క్షేమము శాంతి సమాధానాలున్నాయి. యెషయా యిలా అంటున్నాడు, "అక్కడ దారిగానున్న రాజ మార్గము ఏర్పడును అది పరిశుద్ధ మార్గమనబడును అది అపవిత్రులు పోకూడని మార్గము, అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును మూఢులైనను దానిలో నడుచుచు త్రోవను తప్పక యుందురు అక్కడ సింహముండదు క్రూరజంతువులు దాని ఎక్కవు, అవి అక్కడ కనబడవు విమోచింపబడినవారే అక్కడ నడచుదురు యెహోవా విమోచించినవారు పాటలుపాడుచు తిరిగి సీయోనునకు వచ్చెదరు. వారి తలలమీద నిత్యానందముండును వారు ఆనందసంతోషములు గలవారై వచ్చెదరు దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును" (8, 9 వచనాలు). మనం దేవునిలో జీవించినట్లయితే మన చుట్టూ ఆయన శక్తి ఆవరించియుంటుంది. మనల్ని ఎవరూ భయపెట్టరు, గాయపెట్టలేరు, హాని చేయలేరు కూడ.

ఈ వాక్య భాగంలో మనకేం అర్థమవుతుందంటే చెరనుండి యెరూషలేముకు తిరిగివచ్చేవారితో దేవుడు జీవిస్తూ వారినెంతగా ఆశీర్వదిస్తాడంటే వారు ఆ పట్టణాన్ని తిరిగి పునర్నిర్మిస్తారని మనకు గుర్తుచేయబడుతుంది. సంఘం అనేది దేవుని భవనం మరియు దానిలో ప్రవేశించి హాజరయ్యేవారు దేవుని నివాస స్థలంగా ఉంటారు. అతడిలా అన్నారు, "ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీయులకు 2:21, 22). దేవుడున్న దగ్గర నీవు ఉన్నట్టయితే నీవు ఆశీర్వదించబడిన వాడవవుతావు సుమా.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ ఎదోమును గూర్చిన రెండవ దైవోక్తి ❖❖❖
### (34వ అధ్యాయము)

ఎదోమును గురించిన దైవోక్తి 34 అధ్యాయములో యిమిడియున్నది. ఎదోము గురించి యిప్పటికే దైవోక్తిని యెషయా యింతకు ముందే తెల్పియున్నాడు. కాని అప్పుడు "దూము" అనే పదము వాడినాడు కాని "ఎదోము" అని మాత్రం వాడలేదు. పరాయి దేశాల గురించి వ్యతిరేకంగా మాట్లాడిన తర్వాత యిప్పుడు ఎదోము గురించిన దైవోక్తిని పల్కుచున్నాడు. యెహెజ్కేలు కూడ యిదే పని చేశాడు. పరాయి దేశాల గురించిన దైవోక్తులను తన

గ్రంథంలో లిఖించాడు. ఈ విధంగా ఎదోము నిమిత్తమైతే ఎక్కువ స్థలం కేటాయించాడు (25 అధ్యాయం). తర్వాత తన పుస్తకంలో (35 అధ్యాయం) మరొక దైవోక్తిని చేర్చినాడు. వాక్య భాగంలోనైతే శయీరును గూర్చిన దైవోక్తి అని యున్నది కాని అది ఎదోములో ఒక ప్రాంతమే. కొంతమంది అభిప్రాయమేమనగా యెషయా ఎదోము అని చెబుతున్నప్పుడు కేవలం ఆ దేశం గురించే చెప్పడం లేదుగాని, అనేక దుష్టత్వపు శక్తుల గురించి అనేకం ప్రస్తావిస్తున్నాడు అని. ఉదాహరణగా 1, 2 వచనాల్లో ఎదోము గురించి మాత్రమే ప్రత్యేకంగా సూచించడం కాదుగాని, మిగతా వచనాలు మాత్రం సూచిస్తున్నాయి.

4వ వచనం నుండి పాట రూపంలో పద చిత్రం ఉపయోగించబడింది, "ఆకాశ సైన్యమంతయు క్షీణించును కాగితపు చుట్టవలె ఆకాశవైశల్యములు చుట్టబడును. ద్రాక్షావల్లినుండి ఆకు వాడి రాలునట్లు అంజూరపు చెట్టునుండి వాడినది రాలునట్లు వాటి సైన్యమంతయు రాలిపోవును" (4 వచనం). ఈ రెండవ రాకడ మరొక వివరణాత్మకమైన వివరణతో సూచించబడింది, "యెహోవా ఖడ్గము రక్తమయమగును ... ఏలయనగా బొస్రాలో యెహోవా బలి జరిగించును ఎదోము దేశములో ఆయన మహా సంహారముచేయును" (యెషయా 34:5, 6). బొస్రా అనునది ఎదోములో ఒక ప్రాంతమైనా అయుంటుంది లేదా ప్రక్క ప్రాంతమై యుంటుంది. దేవుడు ప్రజలను వారి శత్రువులకు అప్పగించుచున్నాడు.

## ❖❖❖ దేవుని యొక్క ఘనత ❖❖❖
## (35:1–7)

కలవరపెట్టుచున్న ఈ వాక్య భాగం ఎంతో ఆనందభరితమై 35వ అధ్యాయంతో ముగిస్తుంది. దేవుని ప్రజలు పరిస్థితులు కొంత మెరుగుపడుతున్నాయి.

ఆరాబా అనునది ఒక ఎడారి (1 వచనం). ఇక్కడ అరబీలు ఆ పేర్లను "ఎండిపోయిన" అనే మాటనుండి పొందడం జరిగింది యెషయా ప్రవచనం ప్రకారం "అది బహుగా పూయుచు ఉల్లసించును" (2బి వచనం). గతంలో ప్రస్తావించబడిన ప్రతి స్థలము ఆశీర్వదింపబడుతుంది (3–7 వచనాలు).

## ❖❖❖ ప్రభువు యొక్క రాజ్య మార్గము ❖❖❖
## (35:8–10)

దేవుని ప్రజలు చెరనుండి తిరిగి రావలసియున్నది (8 వచనం). మెసపొటోమియానుండి పాలస్తీనా వరకు దేవుడు వారికొక చక్కని మార్గం వేస్తున్నాడు. అంటే అక్షరార్థంగా నిజంగా బాటవేయలేదు గని అలంకారప్రాయంగా మాత్రమే అది జరిగింది. దాన్ని యెషయా "పరిశుద్ధ మార్గము" అని అంటున్నాడు (8 వచనం). అతడింతగా యిలా వర్ణిస్తున్నాడు, అది ఎవరు నడిచే మార్గమంటే, "విమోచింపబడినవారు" అనగా ప్రభువుచే విమోచింపబడినవారు (9, 10 వచనాలు). దుష్టులకు గాని, కూరమృగాలకు గాని, అపవిత్రులైన వ్యక్తులకు ఈ మార్గంలో ప్రవేశం లేదు. కాని దేవున్ని అనుసరించినవారే ఈ మార్గంలో ప్రయాణం చేయగలరు. "నిత్యానందాన్ని" అనుభవించగలరు మరియు "ఎల్లప్పుడు సంతోష ఆనందాలతో" విలసిల్లుతుంటారు. వారికి నిరాశానిస్పృహలకు చోటే లేదు (10 వచనం).


యెషయా కాలములోని
అష్షూరు సామ్రాజ్యము
యొక్క రమారమి పరిధి
క్యాస్పియన్ సముద్రము
క్రేతే
మధ్యధరా సముద్రము
కర్కెమిషు
అర్పాదు
హమాతు
హారాను
నినెవె
అష్షూరు
యూఫ్రటీసు
టైగ్రిస్
మాదియ
ఆరాము (సిరియా)
సీదోను
దమస్కు
తూరు
ఇశ్రాయేలు
యొర్దాను నది
అమ్మోను
బబులోను
యూదా
యెరూషలేము
ఫిలిష్తీయ
మోవాబు
బబిలోనియా
ఏలాము
సోయను
మృత సముద్రము
కేదారు
ఐగుప్తు
ఏదోము (సిర్)
పర్షియ
అరేబియా
పర్షియ జలసంధి
సీనాయి
ఇతియోఫియా (కూషు)
ఇశ్రాయేలు
తేమా
దదాను
ఎర్ర సముద్రము